క్లుప్తంగా

వికసించిన మే పుష్పం



డిచ్‌పల్లి: ప్రతి ఏటా మేలో పూసే బ్లడ్ లిల్లీ (మే) పుష్పం ఏప్రిల్ నెలాఖరునే వికసించింది. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో నివసించే తెయూ కాంట్రాక్టు అధ్యాపకుడు దేవరాజు శ్రీనివాస్ ఇంటి ఆవరణలో సోమవారం మే పుష్పం వికసించగా, చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ మొక్కలో మంచి ఔషధ గుణాలు ఉంటాయని శ్రీనివాస్ తెలిపారు.

నగరంలో ఫ్లాగ్ మార్చ్



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఈసందర్భంగా సిబ్బంది తిరుగుతూ ఓటర్లను చైతన్య పర్చినట్లు తెలిపారు. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, సీఏపీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ల ఆవిష్కరణ



డిచ్‌పల్లి: మండల కేంద్రంలో సోమవారం ఐఎఫ్‌టీయూ నాయకులు నడిపల్లి గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి మేడే వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి జేపీ గంగాధర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో అన్ని వర్గాల కార్మికులు మేడే వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘ ప్రతినిధులు సుప్రియ, లక్ష్మి, సృజన, అరుణ, భావన, సంతోష్, రాము పాల్గొన్నారు.

కవులు, రచయితలపై దాడులు సరికావు

డిచ్‌పల్లి: కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం కవులు, రచయితలపై అల్లరి మూకలు దాడి చేయడం సరికాదని, హేయమైన చర్య అని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘటనకు కారకులైన వారిని అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నరేందర్, గణేష్, అనిల్ కుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తెయూ హాస్టల్స్ తెరిచి ఉంచాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ హాస్టల్స్‌ను వేసవి సెలవులలో తెరిచి ఉంచాలని వర్సిటీ ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వారు వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ మాట్లాడుతూ.. ప్రస్తుతం పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులకు హాస్టల్స్ మూసివేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ పేద విద్యార్థులు ఇక్కడే ఉండి చదువుకునేందుకు హాస్టల్స్ తెరిచి ఉంచి, భోజన వసతి కల్పించాలని కోరా రు. నాయకులు సాయి, అమృత్‌చారి, సంతో ష్, వినోద్,నరేష్,హారిక, మానిక పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్ పరీక్ష



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నిశిత డిగ్రీ కళాశాలలో సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహించారు. ప్రశ్నాపత్రాలను నిశిత డిగ్రీ కళాశాలల చైర్మన్ రాజు, సూరి ఆవిష్కరించారు. నాయకులు మహేష్, విగ్నేష్, దీపిక, గణేష్, ఆజాద్, సంతోష్, అజయ్, సూర్యపాల్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా..

- 'ఇందూరు యువత' సేవా కార్యక్రమాలు
- నగరంలో నిత్యం అన్నదానం
- అభాగ్యులకు వైద్య సేవలు
- ఆశ్రమం ఏర్పాటే లక్ష్యంగా ముందుకు..



అభాగ్యులకు వైద్య సేవలు అందిస్తూ..



నగరంలో అన్నదానం నిర్వహిస్తున్న సేవా సంస్థ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: నిరాశ్రయులకు, విధివంచితులకు మేమున్నమంటూ అండగా నిలుస్తూ, సేవలందిస్తున్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. దృఢ నిశ్చయం, తపన, పట్టుదల, సమిష్టి కృషితో గత 13ఏళ్లుగా వివిధ విభాగాల్లో సేవలు అందిస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపిస్తున్నారు.

2011లో ఏర్పాటు..

డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మద్దుకూరి సాయిబాబు తన స్నేహితుడికి రెండు కిడ్నీలు ఫెయిల్‌కావడంతో సహాయం చేస్తున్న సమయంలో సేవా సంస్థ ఆలోచన వచ్చింది. ఎంతోమంది రోగాల బారిన పడడమే కాకుండా, రోడ్ల మీద నిరాశ్రయిలకు, విధించితులకు సహాయం చేయాలని నిశ్చయించుకున్నారు. అలా ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ 2011లో ప్రారంభమైంది. తర్వాతా నలుగురు స్నేహితులు సైతం అండగా ఉండడంతో మరింత మందికి సేవ చేయడానికి ముందుకు కదిలారు. ఇప్పుడు 200మంది వరకు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారు. ఇందులో రిటైర్డు ఉద్యోగులు, ఉద్యోగులు, యువత ఇలా సభ్యులుగా ఉండి సంస్థ తరపున సహాయ కార్యక్రమాలు చేస్తున్నారు.

సంస్థ సేవా కార్యక్రమాలు..

- సంస్థ ఏర్పాటైన మొదట్లో కేవలం రాత్రి సమయంలో నగరంలోని రోడ్ల మీద ఉండే పేదలకు అన్నదానం చేసేవారు. గత రెండు సంవత్సరాల నుంచి ప్రతినిత్యం 200మందికి ఉదయం, పగలు సమయంలో కూడా అన్నదానం చేస్తున్నారు. నగరంలోని క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చే రోగుల బంధులకు కూడా అన్నదానం చేస్తున్నారు.
- అనారోగ్యం, మతిస్థిమితంతోపాటు వివిధ రోగాలతో సతమతమవుతూ రోడ్లు, చెత్త కుప్పలు, బస్టాండ్, రైల్వేస్టేషన్‌లల్లో జీవిస్తున్న అభాగ్యులకు సపర్యలు చేసి, వైద్య సేవలు అందిస్తున్నారు.
- 2015 సంవత్సరం నుంచి అనాథ శవాలకు దహన సంస్కరాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 97మందికి కార్యక్రమాలు పూర్తి చేశారు.
- రోడ్ల మీద నిరాశ్రయలు, అభాగ్యులకు నిలువ నీడ లేదని, మతిస్థిమితం లేక అవస్థలు పడుతున్న వారికి ఇందూరు యువత మరింత అండగా ఉండేందుకు 'మనశ్శాంతి కోవేల' ఏర్పాటు చేయబోతున్నారు. ఈ ఆశ్రమాన్ని 2025 సంవత్సరం అందుబాటులోకి తీసుకురానున్నారు.

సేవకే నా జీవితం అంకితం

నా జీవితాన్ని సమాజా సేవకే అంకితం చేశాను. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థను 2011లో ప్రారంభించాను. నాటి నుంచి నేటి వరకు నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. మా సంస్థలో ఎంతో మంది సభ్యులు చేరి అండగా నిలిచారు. ఏ కార్యక్రమాలు చేసినా అధికారులు, అనధికారులు సైతం మమ్మల్ని మరింత ప్రోత్సహించి అభినందిస్తున్నారు. దీంతో స్వేచ్ఛగా సేవ చేయగలుగుతున్నాం. జిల్లాలో మనశ్శాంతి కోవెల ఆశ్రమం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. ఆశ్రమ ఏర్పాటుకు జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు, దాతలు సహకారం అందించాలి.

– మద్దుకూరి సాయిబాబు, ఇందూరు సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు

ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి తీరుతాం



పడకల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- వలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

జక్రాన్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల పంట రుణాలను మాఫీ చేసి తీరుతామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్పష్టం చేశారు. జక్రాన్‌పల్లిచ కేశ్‌పల్లి, కేశ్‌పల్లి తండా, పడకల్, కలిగోట్, చింతలూర్ గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగు గ్యారంటీలు అమలవుతున్నాయని తెలిపారు. మరో రెండు పథకాలను త్వరలోనే అమలు చేస్తామన్నారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారు. ఎంపీ అర్వింద్ ప్రజలకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జీవన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పడకల్‌లో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు సాయరెడ్డి, చిన్నారెడ్డి, శేఖర్‌గౌడ్, గోర్త రాజేందర్, అనంత్‌రెడ్డి, అర్గుల్ నర్సయ్య, శ్రీనివాస్‌గౌడ్, రమేష్, విఠల్, అరుణ్, రవిగౌడ్, శ్రీధర్, కాట్‌పల్లి నర్సారెడ్డి, తంబాకుల గంగారెడ్డి, మహేందర్, పురుషోత్తం, చిన్నారెడ్డి, జితేష్, సాయికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

డిచ్‌పల్లి: రాష్ట్ర బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుంపల నారాయణ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు మేక బాగారెడ్డి, ఈగ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



డిచ్‌పల్లి: మండలంలోని నాకాతండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తారాసింగ్ ఇటీవల బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. తిరిగి సోమవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో సొంతగూటికి (బీఆర్ఎస్) చేరారు. తారాసింగ్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, నీరడి పద్మారావు, చాకలి సాయిలు, పుప్పాల గీత పాల్గొన్నారు.

బీజేపీతోనే పసుపు బోర్డు

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి దసరా వరకు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తాననడం విడ్డూరంగా ఉందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పసుపు బోర్డు ఎక్కడ తెచ్చావని ఎంపీ అర్వింద్‌ను జీవన్‌రెడ్డి ప్రశ్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీతోనే పసుపుబోర్డు సాధ్యమైందని, ప్రధాని మోదీ ఇచ్చారని, అర్వింద్ తెచ్చారని, నిజామాబాద్‌కు వచ్చిందని తెలిపారు. రుణమాఫీ, చక్కెర పరిశ్రమల పునఃప్రారంభంపై సీఎం, జీవన్‌రెడ్డి తలోమాట మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని ప్రచారం చేసుకోవాలని, అర్వింద్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు.

ఇంటింటికీ బీజేపీ ప్రచారం



నిజామాబాద్‌రూరల్: రూరల్ పరిధిలోని ఖానాపూర్‌లో మహాజన సంపర్క్‌లో భాగంగా సోమవారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఖానాపూర్ 1వ డివిజన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. నాయకులు పద్మారెడ్డి, ఆనంద్ కుమార్, మహేష్, సంతోష్, రామకృష్ణ, గణేష్, ఒడ్డెన్న పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సీఎస్ఐ 2000-2001బ్యాచ్ విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ విద్యార్థులు, కంఠేశ్వర్‌లో గల సీఎస్ఐ స్కూల్ 2000-2001 10వ తరగతి విద్యార్థులు సోమవారం వేర్వేరుగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి టీచర్లను సన్మానించారు.



దుబ్బ పాఠశాల 1998-99 బ్యాచ్ విద్యార్థులు

సంక్షిప్తం

ఆర్థికసాయం అందజేత



ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన బైకం రాజు భార్య సాహితి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో బాధిత కుటుంబానికి అండగా ఉండాలన్న సంకల్పంతో గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు చేయిచేయి కలిపి రూ.లక్ష నలభై మూడు వేలు సేకరించారు. సోమవారం రాజుకు నగదును అందించారు.

పదవీ విరమణ సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో సోమవారం మాజీ రిజిస్ట్రార్, సీనియర్ ప్రొఫెసర్ నసీం పదవీ విరమణ వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారిని రిజిస్ట్రార్ యాదగిరి తదితరులు ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, అపర్ణ, త్రివేణి, లావణ్య, అరుణ, రవీందర్‌రెడ్డి, రాంబాబు తదితరులు ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం



నిజామాబాద్‌అర్బన్: యోగా చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు ఎన్నో లాభాలు ఉన్నాయని పతంజలి యోగా సమితి ఇందూరు జిల్లా అధ్యక్షుడు తొర్తి బుచ్చన్న పేర్కొన్నారు. నగరంలోని కేంద్రీయ గ్రంథాలయంలో సోమవారం యువతీయువకులు ఉచిత యోగా శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు ఉదయం 6నుంచి 7 గంటల వరకు యోగా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో యువత పాల్గొనాలని కోరారు.

నగరంలో ఎమ్మెల్సీ ప్రచారం

ఖలీల్‌వాడి: నగరంలోని 48వ డివిజన్‌లో సోమవారం ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు.

ప్రధాని మోదీని మరోసారి ఆశీర్వదించండి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలో జోరుగా ప్రచారం



నగరంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటు వేసి, ప్రధాని మోదీని మరోసారి ఆశీర్వదించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం ఆయన గౌతంనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే స్థానిక బీజేపీ నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులను ముస్లింలకు దోచిపెట్టే కుట్ర చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ వందరోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తామని, తెలంగాణలో 10కి పైగా ఎంపీ స్థానాలను గెలుపొంది ప్రధాని మోదీకి కానుకగా ఇస్తామని ధీమా వ్యక్తంచేశారు. నాయకులు మాయవర్ సాయిరాం, మాయవర్ రాజు, అనిల్, సంజీవ్, రమేష్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల్లో మార్పు మొదలైంది



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రంలోని ప్రజల్లో మార్పు మొదలైందని, మళ్లీ అధికారంలోకి కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని జనార్దన్ గార్డెన్‌లో సోమవారం బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలను మోసం చేసి గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు సంక్షేమ పథకాలను అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నీళ్లు లేక కరెంటు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్‌లు చేసిందేమి లేదని, కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడే ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. బాజిరెడ్డి గోవర్ధన్, రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, మేయర్ నీతూకిరణ్, శేఖర్, నాయకులు సిర్ప రాజు, సుజాత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, ప్రభాకర్‌రెడ్డి, సుదాం రవిచందర్, మురళి పాల్గొన్నారు.

యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేస్తాం

- ధర్మ రక్షణ, దేశ భద్రత ప్రధాని మోదీతోనే సాధ్యం
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యూనిఫామ్ సివిల్ కోడ్‌ను అమలు చేస్తామని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నగరశివారులోని శ్రీరామగార్డెన్‌లో సోమవారం యువ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిసారి ఓటుహక్కు పొందిన యువకులు జై శ్రీరామ్ అని ఉచ్చరించి ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలిపారు. దేశంలో ధర్మం సుభిక్షంగా ఉండాలన్నా.. దేశంలోని పౌరులకు సంపూర్ణ భద్రత కావాలన్నా కేవలం మోదీ పాలనతోనే సాధ్యమన్నారు. అనంతరం ఎంపీ అర్వింద్‌ను యువకులు ఘనంగా సన్మానించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఐపీఎఫ్ ప్రతినిధి జితేందర్ వైద్య, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్‌రెడ్డి, రణదీష్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఖలీల్‌వాడి: జిల్లా ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ఫిషర్‌మ్యాన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్టీ ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ అభివృద్ధిలో భాగమవుతానన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,600	వెండి (కిలో)	84,500
22 క్యారెట్స్	66,970	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	40	60
బెండకాయ	35	60	పచ్చిమిర్చి	70	100
బీరకాయ	45	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	40	60
కాకరకాయ	50	70	గోబిపువ్వు	35	60
వంకాయ	25	50	బీట్‌రూట్	20	40
పాలకూర	35	60	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	45	60
పుదీనా	35	50	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సిడ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	రత్నం (తెలుగు) - 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 1.40 మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 10.45, 4.40, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	రత్నం (తెలుగు) - 11.30, 2.45, 6.00, 9.15
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు)- 1.40, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)-4.20, 10.35, బడే మియా చోటే మియా (3డీ హిందీ)-7.15
స్క్రీన్-3	మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 1.00, టిల్లు స్క్వేర్ (తెలుగు)-4.00, 10.35, ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 7.10
స్క్రీన్ -4	ది ఫ్యామిలీ స్టార్(తెలుగు) - 1.10, కొంచెం హట్‌కే (తెలుగు) - 4.35, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 7.15, 10.40
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	హ్యాపీడేస్ (తెలుగు)
లలితామహల్	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
విజయ్	రత్నం (తెలుగు)

రహదారిపై పడిపోయిన ధాన్యం బస్తాలు



నిజామాబాద్ రూరల్: రూరల్ మండల పరిధిలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద సోమవారం ధాన్యం లోడ్‌తో వెళుతున్న లారీ తాడు ఊడిపోవడంతో 20 ధాన్యం బస్తాలు రోడ్డుపై పడ్డాయి. సంచులు పడే సమయంలో వాహనదారులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బస్తాలు పడిపోయిన కూడా డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లిపోయాడు. లారీ డ్రైవర్ల నిర్లక్ష్యంతోపాటు సహకార సంఘంలో పనిచేసే అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.